## రోడ్డు పనులను పరిశీలించిన.. మున్సిపల్ కౌన్సిలర్లు..

- బౌరంపేట్ బొడ్రాయి సెంటర్ నుండి ప్రభుత్వ పాఠశాల వరకు రోడ్డు నిర్మాణ పనులు..
- గ్రామస్తులకు ఆటంకం లేకుండా రెండు దఫాలుగా సీసీరోడ్డ పనులు..
- ఈ ఆదివారం గ్రామంలో బోనాల వేడుకలు ఉన్నందున శరవేగంగా పనులు..

-5 లో



రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు,ప్రజాప్రతినిధులు..


# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం | 24 జూలై 2024 | పేజీలు 8


ఎట్టకేలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు, రెవెన్యూ యంత్రాంగం ప్రణాళిక రూపొంచినట్లు స్పష్టమవుతుంది.. కుత్బుల్లాపూర్, దుండిగల్ గండిమైసమ్మ, బాచుపల్లి మండలాల్లోని సర్కారు భూములను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సందర్శించి, పరిశీలించి ప్రత్యేక భద్రత కల్పించేదుకు అధికారులు సంబంధిత భూములను ఆకస్మికంగా సందర్శిస్తున్నారు.. మంగళవారం కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 25/1, 25/2 ప్రభుత్వ భూములను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు.. సర్కారు భూముల పరిరక్షణకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్థానిక రెవెన్యూ అధికారులతో కసరత్తు చేస్తోంది.. భూ కబ్జారులపై ఉక్కుపాదం మోపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 23:



- పేట్ బషీరాబాద్ సర్వే నెం.25/1లో 195.34 ఎ.క, 25/2లో 59.35 ఎ.క ప్రభుత్వ భూమి..
- ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్, తహశీల్దార్ రెహమాన్‌తో,కలిసి పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి..
- ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే క్రిమినల్ కేసులు నమోదు:జే.సి విజయేందర్ రెడ్డి హెచ్చరిక..
- చెరువులు, కుంటలు, కట్టుకాలువల కబ్జాలపై నిఘా పటిష్ఠం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశాలు..
- ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖలకు, కేటాయించిన స్థలాలు కబ్జాకు గురైనట్లు గుర్తించారు..
- ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు..
- మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో విడతల వారీగా ప్రభుత్వ భూముల సందర్శన..

# ప్రభుత్వ భూములపై..!
# రెవెన్యూ నిఘా..!

పేట్ బషీరాబాద్ ప్రభుత్వ భూములను పరిశీలనలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి..



- మేడ్చల్ జిల్లాలో సర్కారు భూముల పరిరక్షణకై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..
- పేట్ బషీరాబాద్ 25/1,25/2 ప్రభుత్వ భూమిని ఆకస్మికంగా సందర్శించిన అదనపు కలెక్టర్..
- సదరు భూమికి సంబంధించిన వివరాలపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్న జేసి..

-2లో

## చెరువుల పరిరక్షణపై.. ఇరిగేషన్ నిర్లక్ష్యం..

### రిటైర్డ్ అయిన అధికారినే.. పదేళ్ళుగా ఔట్ సోర్సింగ్ ఏఈగా విధుల్లో రామారావు..

- ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లను అక్రమార్కులకు కట్టబెట్టేందుకే రామారావు విధులు..?
- వెంటనే సంబంధిత ఔట్ సోర్సింగ్ ఏఈ రామారావును తొలగించాలని డిమాండ్..
- నార్త్ ట్యాంక్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి ఫిర్యాదు చేసిన బీజేపీ నేత ఆకుల సతీష్..
- జీహెచ్‌ఎంసి పరిధిలోని పలు చెరువుల కబ్జాలపై చర్యలు చేపట్టాలని బీజేపీ డిమాండ్..




ఇరిగేషన్ నార్త్ ట్యాంక్ డివిజన్‌లో బీజేపీ నేతల ఫిర్యాదు..




-3 లో

## పల్లె దవఖానాలపై..
## ప్రచారాలు నిర్వహించండి..

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు..

- పల్లె దవఖానాలు పేద ప్రజలకు ఉపయోగ పడేలా ప్రచారం చేయాలి..
- ఔట్ పేషంట్స్ శాతాన్ని పెంచాలన్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

-4 లో



# ప్రభుత్వ భూములపై..! రెవెన్యూ నిఘా..!





అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్, తహాశీల్దార్ రెహమాన్, ఆర్ఐ రేణుక..



**అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 25/1, 25/2 ప్రభుత్వ భూమిలో కబ్జాలపై..! గతంలో "పెన్ పవర్" దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు..! అప్పటి అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, ఆర్డీవోలు మల్లయ్య, రవి, పేట్ బషీరాబాద్ ప్రభుత్వ భూములను సందర్శించిన అనంతరం కూడా..! కబ్జాలు, కేసులు, అధికారులపై దాడులు,(ఆర్ఐ మరియు సిబ్బందిపై) జరిగినప్పటికీ..! నేతల సిఫార్సులతో ఉన్నతాధికారులు కఠినమైన చర్యలు చేపట్టలేక పోయారు.. గతంలో సీఎస్ ఆదేశాలతో గాజులరామారం ప్రభుత్వ భూములను ఆకస్మికంగా సందర్శించిన అప్పటి కలెక్టర్ ఎస్.హరీష్.. హెచ్ఎండిఏకు కేటాయించి 50 ఎకరాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసినా..! స్థానిక రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి కాంపౌండ్ లోపలే అక్రమ కట్టడాలు వెలిస్తే చర్యలు తీసుకోలేక పోయారు.. సదరు హెచ్ఎండిఏ ప్రహరీగోడే అక్రమార్కులకు గేటెడ్ కమ్యూనిటీగా తయారైంది.. మల్లంపేట్ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్‌లో సర్వే నెం.170 ప్రభుత్వ భూమి సుమారు 7.20 ఎకరాలు ఉన్నట్టు ప్రైవేటు సర్వేలు తేల్చినా..! స్థానిక రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.. చెరువులు కబ్జా..! కట్టుకాలువల కబ్జాతో బహుదూర్‌పల్లిలో వరద విపత్తులు..! ఫాక్స్‌సాగర్ నాలా ఆక్రమణతో జీడిమెట్లలోని పలు కాలనీలు నేటికీ జలమయం అవుతున్నాయి.. ఇరిగేషన్ అధికారుల సౌజన్యంతో కొంపల్లిలో పుట్టిన సర్ ప్లస్ వాటర్ "కోల్ నాలా" రూటు మార్చి పలు కబ్జాలకు ప్రముఖ ప్రజాప్రతినిధి అండ ప్రధానమైంది.. అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి దృష్టి సారించి ఫాక్స్‌సాగర్ నాలా కబ్జాలపై చర్యలు చేపడితే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు..**

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ భూముల పరిరక్షణకై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు..! అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు..మంగళవారం జిల్లాలోని కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 25/1, 25/2 ప్రభుత్వ భూములు ఆయన ఆకస్మికంగా సందర్శించారు.. మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్, కుత్బుల్లాపూర్ తహాశీల్దార్ రెహమాన్, ఆర్ఐ రేణుకతో కలిసి పేట్ బషీరాబాద్ ప్రభుత్వ భూములను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పరిశీలించారు.. ఇకపై రోజుకో ఏరియాను ఎంచుకుని పర్యవేక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు.. రూ.వేలకోట్లు విలువచేసే సర్కారు భూములను కబ్జాచేస్తే ఉపేక్షించేది లేదని విజయేందర్ రెడ్డి హెచ్చరించారు.. త్వరలో గాజులరామారం 307, 342, 329 ప్రభుత్వ భూములు.. దుండిగల్ గండిమైసమ్మ మండలం మల్లంపేట్ 170, బాచుపల్లి నిజాంపేట్ సహా..! నియోజకవర్గంలోని పలు చెరువులు, కట్టుకాలువల కబ్జాలను త్వరలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సందర్శించి పరిశీలించనున్నట్లు రెవెన్యూ ఉన్నతాధికారులు తెలిపారు..


## పేట్ బషీరాబాద్ 25/1, 25/2 లో ఉన్నదెంత..?

కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 25/1, 25/2 లలో ప్రభుత్వ భూమిని సందర్శించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి.. క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు.. మొత్తం ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 25/1 లో 195.34 ఎకరాలు ఉండగా..! సర్వే నెం.25/2 లో 59.35 ఎకరాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.. ఇతర శాఖలకు కేటాయించింది ఎంత..? కబ్జాకు గురైన భూ వివరాలు..! కోర్టు కేసులపై వివరాలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు..! 58, 59 జీవో ప్రకారం ఎంత మందికి పట్టాల జారీ చేశారు.. రిజిస్ట్రేషన్‌లు ఎంత మందికి చేశారో తహాశీల్దార్ రెహమాన్, ఆర్ఐ రేణుకను అడిగి తెలుసుకున్నారు.. ప్రస్తుతం మిగిలి ఉన్న భూముల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి అధికారులతో చర్చించారు.. సర్వే నెంబర్ 25/1, 25/2 లలో ఉన్న ప్రభుత్వ భూమిపై ప్రస్తుత పరిస్థితిపై పూర్తి వివరాలను సర్కారుకు నివేదించేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం సిద్ధమవుతున్నట్లు స్పష్టమవుతుంది..

# తెలంగాణ పేరే ఎత్తలే

**హైదరాబాద్ పెన్ పవర్:** లోక్ సభలో మోదీ అనేక సార్లు తెలంగాణ ఏర్పాటు పట్ల విషం కక్కారని, ఇప్పుడు కూడా తెలంగాణకు బడ్జెట్ లో గుండు సున్నాతప్పా.. రూపాయి కూడా ఇవ్వలేని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆయన బీజేపీపై పలు విమర్శలు చేశారు. మేము ఇచ్చిన అంశాలను కేంద్రం పరిగణన లోకి తీసుకోలేదని, నిర్మల సీతారామన్ గారి 2 గంటల ప్రసంగంలో కనీసం తెలంగాణ అనే పదం కూడా ఎత్తలేదని మండిపడ్డారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పునర్విభజనలో చెప్పినట్టు ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ అమరావతి నిర్మాణానికి 15 వేల కోట్లు కేటాయించారు. మరి ఇప్పుడే పురుడు పోసుకున్న తెలంగాణకు ఎందుకు అన్యాయం చేశారని ప్రశ్నించారు. పోలవరానికి జాతీయ హోదా ఇచ్చి నిర్మిస్తున్నారని, తెలంగాణలోని ఒక్క ప్రాజెక్ట్ కూడా జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న రాష్ట్రానికి గుండు సున్నా అంటే ఇది తీరని అన్యాయమేనని ఆవేదన వ్యక్తం చేశారు. మూసి ప్రక్షాళనకు నిధులు కేటాయించాలని వేడుకున్న ఒక్క రూపాయి ఇవ్వలేదుని, ఇతర రాష్ట్రాల్లో నదుల అనుసంధానానికి గంగానది ప్రక్షాళనకు వేల కోట్లు కేటాయించారని తెలిపారు. ఇక కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సొంత నియోజకవర్గం అంబర్ పేట నుండి మూసి నది పోతుంది అయినా ఒక్క రూపాయి అయినా కేటాయించారా..? అని కిషన్ రెడ్డిని ప్రశ్నించారు.

# చెరువుల పరిరక్షణపై.. ఇరిగేషన్ నిర్లక్ష్యం..







**కుత్బుల్లాపూర్ పరిధిలోని లింగం చెరువు నుంచి పరికి చెరువుకు, పంతులు చెరువు నుంచి, చిన్నబంధం, పెద్దచెరువు గొలుసుకట్టు కాలువలు 70 శాతం కబ్జాకు గురైనట్లు ఆరోపించారు.. ఇప్పటికైనా కుత్బుల్లాపూర్ పరిధిలో ముఖ్యంగా సూరారం, గాజులరామారం పరిధిలోని చెరువులు పరిరక్షించి ప్రజలను వరద విపత్తుల నుండి కాపాడాలని కోరారు.. తక్షణమే 10 చెరువుల పరిరక్షణకు పారదర్శకతతో సర్వే నిర్వహించి, ఫైనల్ నోటిఫికేషన్‌తో హెచ్ఎండిఏ సైట్లో మ్యాప్స్ అప్లోడ్ చేయాలని డిమాండ్ చేశారు.. ఎఫ్‌టిఎల్ పాయింట్, పిల్లర్స్ ఏర్పాటు చేయాలని, మున్సిపల్ అధికారుల సహకారంతో, ఇరిగేషన్ నాళాల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్, మురళి ,అరుణ్ రావు, మాధవరావు, ముకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 23:** కుత్బుల్లాపూర్ పరిధిలోని పది చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, నాలాల కబ్జాలకు ఇరిగేషన్ ఔట్ సోర్సింగ్ ఏఈ రామారావు ప్రధాన కారణమని బీజేపీ నేత ఆకుల సతీష్ ఆరోపించారు.. పదవీవిరమణ పొంది పదేళ్ళు గడిచినప్పటికీ..!నిబంధనలకు విరుద్దంగా ఔట్ సోర్సింగ్ ఏఈగా విధుల్లో కొనసాగుతున్న రామారావుపై నార్త్ ట్యాంక్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి ఫిర్యాదు చేశారు..! పలు చెరువులు, కుంటలు, కట్టుకాలువలను కబ్జాకు అప్పగించేందుకు..! నీటిపారుదల శాఖ రామారావును ప్రత్యేకంగా నియమించినట్లు తెలుస్తోందని బీజేపీ నేత ఆకుల సతీష్ ఆరోపించారు.. లేకపోతే రిటైర్డ్ అయిన తర్వాత కూడ గత 10 సంవత్సరాలుగా..! నిబంధనలకు విరుద్దంగా ఔట్ సోర్సింగ్ ఏఈగా రామారావును కొనసాగించడం వల్లనే చెరువుల పరిరక్షణకు కష్టతరం అవుతుందని..! తక్షణమే రామారావును విధుల నుండి తొలగించి.. నూతన ఏఈని నియమించాలని డిమాండ్ చేస్తూ..! నార్త్ ట్యాంక్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి మంగళవారం ఫిర్యాదు చేశారు.. సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ జిహెచ్ఎంసి పరిధిలో పది చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు.. లింగం చెరువు, చిన్న బంధం కుంట, పంతులు కుంట, మహబూబ్ కుంట, పెద్ద చెరువు, బంధం కుంట, చింతలచెరువు, మధ్యల చెరువు, కాలమనకుంట, వడ్డవానికుంట వాటిలో గతంలో మూడు చెరువులకు ఫెన్సింగ్ వేసినప్పటికీ..! ఫెన్సింగ్ తొలగించి కబ్జా చేసుకోవడంపై ఏఈ రామారావు కీలక పాత్ర పోషించారని బీజేపీ నేత సతీష్ ఆరోపించారు.. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో దర్జాగా గత తొమ్మిది సంవత్సరాలుగా ఆక్రమించుకొని, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు తుతూ మంత్రంగానే చర్యలు తీసుకున్నారని అన్నారు.. అందుకు నిదర్శనం సంబంధిత చెరువులను పర్యవేక్షిస్తే తెలుస్తుందని అన్నారు.. చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల్లో ఇరిగేషన్ ప్రధాన కారణం కాగా..! రెవెన్యు అధికారుల బాధ్యతా రహితమే కబ్జాలకు దారితీస్తుందని ఆరోపించారు.. ఫాక్స్‌సాగర్ నాలా కబ్జాలో అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తుంటే..!అధికారులు లక్షలు దండుకుని కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు..





## రామారావు విధుల్లోనే.. చెరువులు, కట్టుకాలువలు కబ్జా..?

కుత్బుల్లాపూర్ పరిధిలో చెరువుల ఆక్రమణలకు ప్రధాన కారణం రామారావు..? ఇరిగేషన్ శాఖలో పదవీవిరమణ పొందిన తర్వాత..! గత పదేళ్ళుగా ఔట్ సోర్సింగ్ ఏఈగా కుత్బుల్లాపూర్ పరిధిలోనే రామారావు ప్రత్యేకంగా పనిచేసేందుకు కొందరు ప్రజాప్రతినిధులు, పేరుమోసిన బిల్డర్‌ల సహకారంతోనే అంటూ ఆరోపణలు వస్తున్నాయి.. ఏఈగా పదవిలో కొనసాగుతూ, చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ స్థలాలకు ఎన్‌ఓసిలు ఇవ్వడం..! కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి పరిధి మీటింగ్‌లో మినట్స్ ఆఫ్ ది మీటింగ్‌లో సంతకం పెట్టే స్థాయిలో అధికారం చేలాయించడంపై విమర్శలు వస్తున్నాయి.. ఎలాంటి బాధ్యత వహించలేని పదవి వల్ల చెరువుల ఆక్రమణకి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించడం వల్ల చెరువుల పరిరక్షణ గాల్లో దీపంలా మారిందని బీజేపీ నేత ఆకుల సతీష్ ఆరోపించారు..









# పల్లె దవఖానాలపై.. ప్రచారాలు నిర్వహించండి..

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు..





- పల్లె దవఖానాలు పేద ప్రజలకు ఉపయోగ పడేలా ప్రచారం చేయాలి..
- ఔట్ పేషంట్స్ శాతాన్ని పెంచాలన్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 23:** పల్లె దవఖానాను పేద ప్రజలకు ఉపయోగపడేలా ప్రచారం నిర్వహించాలని, ఔట్ పేషంట్ శాతాన్ని పెంచాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ డాక్టర్లకు సూచించారు..మంగళవారం పర్యటనలో భాగంగా అన్నోజిగూడలోని పల్లె దవఖానాను పరిశీలించిన కలెక్టర్..! ప్రతిరోజు ఔట్ పేషంట్స్ ఎంత మంది వస్తారు.. మున్సిపాలిటిలో జనాభా ఎంత అని డాక్టర్లు, ఎఎన్ఎంలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోజుకు సుమారుగా 30 మంది ఔట్ పేషంట్స్ వస్తారని డాక్టర్ సమాధానానికి..! ఓపిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు.. మున్సిపల్ సిబ్బందితో స్లమ్ ఏరియాలలో పల్లె దవఖాన గురించి ప్రచారం చేసి, క్యాంపులు నిర్వహించి పేద ప్రజలకు సేవలందించాలన్నారు. దవఖానాలోని రిజిష్టర్లను కలెక్టరు పరిశీ లించి తగు సూచనలు చేసారు. అనంతరం ప్రతాపసిం గారం లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, అంగన్వాడీ సెంటర్లను, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు..





# బంగారం కొనాలనుకునే వారికి బడ్జెట్ లో తీపి కబురు

- రూ.48.21 లక్షల కోట్లతో భారీ బడ్జెట్ ప్రకటించిన నిర్మలా సీతారామన్
- బంగారం, వెండిపై 6 శాతానికి కస్టమ్స్ సుంకం తగ్గింపు
- దేశీయంగా తగ్గనున్న బంగారం, వెండి ధరలు

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచ అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు బాటలు పరుచుకుంటున్న భారత్ ఇవాళ భారీ స్థాయిలో బడ్జెట్ ప్రకటించింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటులో రూ.48.21 లక్షల కోట్లతో కేంద్ర వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లు కాగా, ద్రవ్యలోటు 4.3 శాతం ఉండొచ్చని అంచనాలు వెలువరించారు. అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా చూపించారు. ఇక, ఈ బడ్జెట్ లో నిర్మలా సీతారామన్ బంగారం, వెండి కొనాలనుకునే వారికి తీపి కబురు వినిపించారు. బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకం తగ్గించారు. బంగారం, వెండిపై 10 నుండి 6 శాతానికి సుంకం తగ్గించిన కేంద్రం... ప్లాటినమ్ పై 6.4 శాతానికి సుంకం తగ్గిస్తున్నట్టు బడ్జెట్ లో ప్రకటన చేసింది. కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం వల్ల దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టనున్నాయి.





రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు,ప్రజాప్రతినిధులు..





రేయింబవళ్ళు శరవేగంగా పనులు ప్రారంభం..

# రోడ్డు పనులను పరిశీలించిన.. మున్సిపల్ కౌన్సిలర్లు..

**బౌరంపేట్ బొడ్రాయి సెంటర్ నుండి ప్రభుత్వ పాఠశాల వరకు రోడ్డు నిర్మాణ పనులు..**

**గ్రామస్తులకు ఆటంకం లేకుండా రెండు దఫాలుగా సీసీరోడ్డు పనులు..**

**ఈ ఆదివారం గ్రామంలో బోనాల వేడుకలు ఉన్నందున శరవేగంగా పనులు..**



**దుండిగల్, పెన్ పవర్, జూలై 23:** నిత్యం రద్దీగా ఉండే బౌరంపేటలో రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కౌన్సిలర్‌లు, సంబంధిత అధికారులను ఆదేశించారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపల్ పరిధి, భౌరంపేట్‌లో మిషన్ భగీరథ నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులు గత కొన్ని రోజులుగా కొనసాగుతున్నాయి.. దీంతో రోడ్డు పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది.. గ్రామంలో అను నిత్యం కొన్ని వందల వాహనాలు, తిరగడం ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు.. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన స్పందించారు..

హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్బి అధికారులు, మున్సిపల్ ఏఈ ప్రవీణ్ సమన్వయంతో కమిషనర్ పలుమార్లు పరిశీలించారు.. వెంటనే నూతన రోడ్డును వేసేలా ప్రతిపాదనలతో ప్రణాళిక రూపొందించారు.. గ్రామంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా..! రెండు దఫాలుగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు.. గత రెండు రోజుల క్రితం, బౌరంపేట్ బొడ్రాయి వద్ద పనులు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.. బొడ్రాయి నుండి సుమారు 600 మీటర్ల మేరకు, ప్రభుత్వ పాఠశాల వరకు, మొదటి ధఫా రోడ్డు పనులు చేపట్టినట్లు కమిషనర్ వివరించారు.. మంగళవారం స్థానిక కౌన్సిలర్‌లు, నాయకులు అధికారులతో కలిసి పనులను పరిశీలించారు.. గ్రామంలో వాహనాల తాకిడి అధికంగా ఉండటం వలన..! రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేవిందగా చూడాలని, అధికారులకు కౌన్సిలర్‌లు సూచించారు.. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సుంకరి కృష్ణ, సీనియర్ నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, యస్.వి.సురేందర్ రెడ్డి, మురళీ యాదవ్, పీసరి క్రిష్ణ రెడ్డి, హెచ్.ఎం.డబ్లు. ఎస్ మేనేజర్ సౌమ్య, ఏఈ ప్రవీణ్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పనుల పరిశీలనలో కౌన్సిలర్‌లు శ్రీనివాస్ రెడ్డి, సుంకరి కృష్ణ,





బౌరంపేట్ గ్రామంలో కౌన్సిలర్ల పర్యటన..



# టీడీపీ, జేడీయూ పార్టీలను సంతృప్తి పరిచేందుకు తీసుకువచ్చిన బడ్జెట్ లా ఉంది

- కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్న ఉత్తమ్ కుమార్
- తెలంగాణ పట్ల వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యాఖ్య
- పోలవరంకు హామీ ఇచ్చిన కేంద్రం, పాలమూరు ప్రాజెక్టుకు హామీ ఇవ్వలేదని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:** బడ్జెట్ లో ఏపీకి భారీగా కేటాయింపులు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం, తెలంగాణకు మాత్రం మొండిచేయి చూపిందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏపీకి కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయించడాన్ని తామేమీ తప్పుబట్టడంలేదని, కానీ తెలంగాణ రాష్ట్రం పట్ల ప్రదర్శిస్తున్న వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఏపీలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం... తెలంగాణలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఎందుకు హామీ ఇవ్వలేకపోయిందని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ట్రైబల్ యూనివర్సిటీకి బడ్జెట్ లో నిధులు కేటాయించలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రుల బృందం గత ఏడు మాసాలుగా నిధులు కేటాయించాలని కోరుతూ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు.
'బీహార్ కు రూ.41 వేల కోట్లు, ఏపీకి రూ.15 వేల కోట్లు ప్రకటించారు, పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు అందిస్తామన్నారు... కానీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను మాత్రం పూర్తిగా విస్మరించారు' అంటూ ఉత్తమ్ కుమార్ ధ్వజమెత్తారు. దీన్నిబట్టి చూస్తే, ఇది ప్రజల బడ్జెట్ కాదని, రాజకీయ ఉద్దేశాలతో కూడిన బడ్జెట్ అని స్పష్టంగా అర్థమవుతోందని అన్నారు. జేడీయూ, టీడీపీలను సంతృప్తి పరిచేందుకు తీసుకువచ్చిన బడ్జెట్ లా ఉందని విమర్శించారు.




# విస్తారంగా వర్షాలు... రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు ఇవే..





**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు దుక్కి దున్ని నారు మడులు వేశారు. ఈ నేపథ్యంలో పంట సాగు చేసే రైతులు అధిక దిగుబడి సాధించేందుకు కొన్ని రకాల ప్రత్యేక పద్ధతులను అవలంభించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వర్షాకాలంలో తెగులు ఎక్కువగా వచ్చే అవకాశంఉంది. వీటి బారి నుంచి కాపాడుకోవాలి. వివిధ పంటలతో పాటు, మురుగునీటి నిల్వను అరికట్టడం, పురుగు మందులు పిచికారి వంటి వ్యవసాయ పనులపై వ్యవసాయ నిపుణులు కొన్ని సూచనలను జారీ చేశారు. ఇప్పుడు ఏ పంటకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం. . .
భారీ వర్షాలతో పంట పొలంలోకి మురుగు నీరు చేరుతుంది. ఇంకా కొన్ని రోజుల పాటుటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పుడు పంటపొలాల్లో మందులను పిచికారి చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచనలున్నందున రైతులు విద్యుత్ స్థంబాలు, విద్యుత్ తీగలు, చెరువులు, నీటి కుంటలకు దూరంగా ఉండాలి. రాష్ట్రంలో అక్కడక్కడ వివిధ జిల్లాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచనలున్నందున రైతులు చెట్ల కింద నిలబడరాదు. పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచరాదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

**వివిధ పంటల్లో చేపట్టాల్సిన చర్యలు:**

**వరి:** నీరు సంవృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు స్వల్పకాలిక (120 నుంచి -125 రోజుల) వరి రకాల నారుమళ్ళు పోసుకోవడానికి అనువైన సమయం.
25 మరియు 30 రోజుల వయస్సు ఉన్న మధ్యకాలిక .. స్వల్పకాలిక వరి రకాలను నాటు పెట్టుకోవాలి.
దీర్ఘకాలిక వరి రకాల నారు బాగా ముదిరి (50రోజుల వయస్సు) ఆలస్యంగా నాటినప్పుడు ఆకు చివరలను తుంచి వేసి కుదురుల సంఖ్యను పెంచి కుదురుకు 6 నుండి 8 మొక్కల చొప్పున నాటువేయాలి.
నత్రజని ఎరువులను సిఫారసు కంటే 25శాతం పెంచి మూడు దఫాలుగా కాని లేదా రెండు దపాలుగా అంటే 70శాతం నాటే సమయంలో మిగతా 30శాతం అంకురం దశలో వేసుకోవాలి.
వరి నాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రా. కార్బోఫురాన్ 3జి గుళికలను ఇసుకలో కలిపి చల్లినట్లయితే ప్రధాన పొలంలో పంటను 15-నుంచి 20 రోజుల వరకు కొన్ని రకాల పురుగుల నుండి కాపాడుకోవచ్చు.
ఇప్పటివరకు నార్లు పోయని రైతాంగం, వర్షాలను సద్వినియోగము చేసుకొని పొలాలను దమ్ము చేసి వరి పంటను నేరుగా విత్తే పద్ధతిలో విత్తుకోవడము వల్ల సమయము, పెట్టుబడి ఆదా చేసుకోవచ్చు.
నాటు పెట్టిన తర్వాత ప్రతి 2 మీటర్లకు కాలి బాటను తీయటం వల్ల గాలి వెలుతురూ బాగా ప్రసరించడంతో బాటు సుడిదోమ ఉధృతిని నివారించవచ్చు. అదేవిధంగా రైతులు ఎరువులు, పురుగు మందులు పంటకు అందించడానికి సులువుగా ఉంటుంది.
ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను నాటిన 10 నుండి 15 రోజుల మధ్య పిచికారి చేయడం వలన కాండం తొలుచు పురుగు, ఉల్లి కోడును నివారించుకోవచ్చు.

**పత్తి:**
వర్షాలు కొంచెం తగ్గిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ రసాయనిక ఎరువులను పైపాటుగా 20 రోజుల, 40 రోజుల వయసున్న పంటకు మొక్కల మొదళ్లలో 7-10 సెం.మీ దూరంలో పాదులుతీసి రసాయనిక ఎరువులను వేసి మట్టితో కప్పాలి.
ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13-0-45 లేదా 10 గ్రా. యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.
నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళను నివారించుటకు 3గ్రా. కాపర్ -ఆక్సీ-క్లోరైడ్ లేదా 2 గ్రా. కార్బెండజిమ్ ం మ్యాంకోజెబ్ శిలీంద్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
పత్తి పంటలో వచ్చే గడ్డి జాతి, వెడల్పాకు కలుపు మొక్కలను నివారించడానికి (2 నుంచి 3 ఆకుల దశలో ఉన్న కలుపు మొక్కలు) 2 మి.లీ. క్విజలోఫాప్ ఇథైల్ ం 1.25 మి.లీ. పైరిథాయోబ్యాక్ సోడియం కలుపు మందులను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మొక్కజొన్న:**
మొక్కజొన్న శాకీయ దశలో ఎక్కువ నీటిని తట్టుకోలేదు కాబట్టి పొలం నుండి నీటిని వెంటనే తీసివేయాలి.
అధిక వర్షాల వల్ల నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఊదారంగులోకి మారే అవకాశం ఉంటుంది. కావున వర్షాలు నిలిచిన తర్వాత 5 గ్రా. 19-19-19 లేదా 20 గ్రా. డిఏపీ ఎరువును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారి చేయాలి.
మొక్కజొన్న పంటను జులై 31వ తేదీ వరకు స్వల్పకాలిక రకాలను దిగుబడిలో ఎటువంటి తరుగుదల లేకుండా విత్తుకునేందుకు అనుకూల సమయం.
మోకాలు ఎత్తుదశలో ఉన్న పైరులో ఒక కిలో సున్నం, 9 కిలోల ఇసుకను కలిపి మొక్క సుడులలో వేసి కత్తెర పురుగును నివారించుకోవచ్చు.
వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత వర్షాధార పంటకు పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పోటాష్ ను వేసుకోవాలి

**జొన్న:**
ముందస్తు నివారణ చర్యల భాగంగా జొన్నలో కాండం తొలుచు పురుగు నివారణకు, పంట విత్తిన 30-నుంచి35 రోజుల దశలో ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను కాండము సుడులలో వేయాలి.

**కంది:**
ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలో ఫైటాప్తోర ఎండుతెగులు వచ్చే అవకాశం ఉంది. ఈ తెగులు గమనించినచో నివారణకు 2 గ్రా. మెటలాక్సిల్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి.

**సోయాచిక్కుడు:**
ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలో వేరుకుళ్ళు తెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించినచో నివారణకు 3 గ్రా. కాపర్-ఆక్సీ-క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి.
సోయాచిక్కుడు పంటలో కాండం కుళ్ళు తెగులు గమనించినట్లయితే 2.5 గ్రా కార్బండాజిమ్ ం మ్యాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల వలన 25 రోజుల పంటలో 250 మి.లీ. ఇమాజితాపిర్ 10% %ూా% లేదా 40గ్రా. ఇమాజితాపిర్ ం ఇమాజామాక్స్ కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి గడ్డి, వేడల్పాకు కలుపు జాతి మొక్కలను నివారించాలి.

**వేరుశనగ:**
ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వేరుశనగలో మొదలుకుళ్ళు తెగులు సోకే అవకాశం ఉంది. దీని నివారణకు మొక్కల మొదళ్ళ దగ్గర 2గ్రా. కార్బండజిమ్ ం మ్యాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి నేలను తడపాలి.

**కూరగాయలు:**
టమాట, వంగ, మిరప, బంతి పంటల నారుమళ్ళలో నారు కుళ్ళు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీ-క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి నేల పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేయాలి.
ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కూరగాయల పంటలలో ఆకుమచ్చ తెగులు సోకుటకు, అనుకూలం. తెగులు నివారణకు 1 గ్రా. కార్బెండజిమ్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**చెరకు:**
ముంపునకు గురయ్యే ప్రాంతాలల్లో ప్రతీ 25 మీటర్లకు ఊటకాలువలు ఏర్పాటు చేసుకొని తోటలో నీరు నిలువకుండా మురుగును నీటి కాలువల ద్వారా తొలగించాలి.

# అసెంబ్లీకి వస్తారా..? లేదా..?.. తొలిరోజు అసెంబ్లీకి కేసీఆర్ దుమ్మా

- బీఏసీ మీటింగ్ కు హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి
- రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి
- సార్ వస్తారో..? లేదో చెప్పం అన్న హరీశ్
- అది మా స్ట్రాటజీ అంటూ దాటవేత
- కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎల్పీ మీటింగ్
- ఐదుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు దుమ్మా



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా..? లేదా..? అన్నది హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ సారి అసెంబ్లీకి వస్తారని జోరుగా ప్రచారం జరిగింది. ఇవాళ సమావేశాలు ప్రారంభమయ్యాయి. బీఏసీ సమావేశానికి ఆయనే హాజరవుతారని అంతా భావించారు. సీన్ కట్ చేస్తే బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. సమావేశాల ఎజెండాపై చర్చించారు. అయితే కేసీఆర్ మాత్రం మధ్యాహ్నం తర్వాత తెలంగాణ భవన్ లో జరిగిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశానికి హాజరై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. కొందరు పార్టీ నేతలు మాత్రం బడ్జెట్ రోజు అసెంబ్లీకి వస్తారని చెబుతున్నారు. అయితే నిన్న హరీశ్ రావు మీడియాతో చేసిన చిట్ చాట్ లో కేసీఆర్ అసెంబ్లీకి వస్తారో లేదో..? చెప్పం.. అది మా స్ట్రాటజీ అంటూ దాటవేశారు.

మధ్యాహ్నం తర్వాత తెలంగాణ భవన్ లో ఎల్పీ మీటింగ్ నిర్వహించిన కేసీఆర్ తొమ్మిది అంశాలపై సభలో చర్చించాలని సూచించారు. అయితే ఈ సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అనారోగ్యం కారణంగా గైర్హాజరయ్యారు. ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న ఆలస్యంగా సమావేశానికి వచ్చారు.

స్వయంగా పార్టీ చీఫ్ కేసీఆర్ హాజరైన సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు దుమ్మా కొట్టడం బీఆర్ఎస్ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే, ఎల్పీ సమావేశానికి గైర్హాజరైన వారిలో కొందరు పార్టీ మారబోతున్నట్లు గత కొంత కాలంగా పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.

# కేంద్ర బడ్జెట్‌పై సీఎం రేవంత్ రెడ్డి రియాక్షన్ మాములుగా లేదుగా..



**హైదరాబాద్ పెన్ పవర్:**కేంద్ర బడ్జెట్?పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణపై కేంద్రం కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఢిల్లీకి వెళ్లి మూడుసార్లు ప్రధాని మోదీని కలిసినా లాభం లేకుండా పోయిందని, తెలంగాణ మంత్రులు 18 సార్లు కేంద్ర మంత్రులను కలిశారని గుర్తు చేశారు. పెద్దన్న పాత్ర పోషించాలని మోదీని పదేపదే కోరానని సీఎం చెప్పారు. వివక్ష లేకుండా నిధులు కేటాయించాలని కోరారని తెలిపారు. బడ్జెట్?లో తెలంగాణ అనే పదాన్ని నిషేధించారని కేంద్రం తీరు పట్ల సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ పదాన్ని పలకడానికి కూడా మనసు ఒప్పలేదని కేంద్రంపై సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ పట్ల మోదీ మొదటి నుంచి వివక్ష చూపారని, విభజన చట్టం వంకతో ఏపీకి నిధులు కేటాయించారని సీఎం చెప్పారు. తెలంగాణకు నిధులిచ్చే బాధ్యత కేంద్రానికి లేదా అని ఆయన నిలదీశారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఏమైందని ప్రశ్నించారు. ములుగులో గిరిజన వర్సిటీకి నిధులేవని సూటిగా సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

**సీఎం రేవంత్ ఇంకా ఏమన్నారంటే..**

- ⇨ తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఆలోచన చేయడం లేదు
- ⇨ కేంద్ర బడ్జెట్ కుర్చీ బచావో బడ్జెట్?లా ఉంది
- ⇨ మెట్రోకు నిధుల్లేవు.. ఐటీ కారిడార్ ఊసే లేదు
- ⇨ అమరావతికి వేల కోట్లు ఇస్తరు.. మెట్రోకు ఇవ్వరా..?
- ⇨ ఈ బడ్జెట్ క్విడ్ ప్రోకోలా ఉంది
- ⇨ పోలవరానికి వేలకోట్లు ఇచ్చినప్పుడు పాలమూరు ఏం పాపం చేసింది..?
- ⇨ విభజన చట్టం ప్రకారం తెలంగాణకు నిధులు ఎందుకివ్వలేదు?
- ⇨ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ బీజేపీ బోగస్ నినాదం
- ⇨ 35 శాతం ఓట్లు, 8 ఎంపీ సీట్లు ఇస్తే తెలంగాణకు ఇచ్చేది ఇదేనా?
- ⇨ తెలంగాణ ప్రజలకు బీజేపీ నాయకత్వం సమాధానం చెప్పాలి
- ⇨ కుర్చీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారు
- ⇨ అసెంబ్లీ సమావేశాల్లో కేంద్రం వివక్షపై చర్చిస్తాం
- ⇨ కిషన్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలి
- ⇨ కిషన్ రెడ్డి, సంజయ్ బానిసలుగా కాకుండా పౌరులుగా ఆలోచించాలి
- ⇨ తెలంగాణ నిధుల కోసం 17 మంది ఎంపీలు కలిసి కొట్లాడుదాం

# స్టాంప్ డ్యూటీపై రాష్ట్రాలకు నిర్ణయాధికారం

- పన్ను పెంచుకునేందుకు మార్గం సుగమం చేసిన కేంద్రం
- మహిళల ఆస్తుల రిజిస్ట్రేషన్ పై స్టాంప్ డ్యూటీ తగ్గింపు
- ఎన్ పీఎస్ పథకంలో మైనర్లూ చేరేలా మార్పులు



**హైదరాబాద్ పెన్ పవర్:**స్టాంప్ డ్యూటీపై నిర్ణయాధికారాన్ని రాష్ట్రాలకే అప్పజెప్పనున్నట్లు కేంద్రం ప్రకటించింది. స్టాంప్ డ్యూటీ పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. అదేసమయంలో మహిళల ఆస్తుల రిజిస్ట్రేషన్ పై స్టాంప్ డ్యూటీ తగ్గిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇక ఎన్‌పీఎస్ పథకంలో మార్పులు చేస్తూ మైనర్లు కూడా చేరేందుకు వీలు కల్పించారు. గ్రామీణాభివృద్ధికి రూ.2.66 లక్షల కోట్లను కేంద్రం ఈ బడ్జెట్ లో కేటాయించింది. ముద్ర రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో వెల్లడించారు.

# ఇది బాధాకరమైన తీర్మానం... అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి

## ప్రారంభమైన తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

## దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత మృతికి సంతాపంగా తీర్మానం

## లాస్య తండ్రి సాయన్నతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సీఎం

## వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన రేవంత్

**హైదరాబాద్ పెన్ పవర్:** శాసనసభ సమావేశాల ప్రారంభం అనంతరం కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత మృతికి సంతాపంగా తీర్మానం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇలాంటి తీర్మానం ఒకటి ప్రవేశపెట్టాల్సి వస్తుందని తాను ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లాస్య తండ్రి సాయన్న తనకు అత్యంత ఆప్తుడని, చాలా ఏళ్ల కలిసి పనిచేశామని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేసుకున్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి సాయన్న ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకున్న లాస్య నందిత దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించారని తెలిపారు. కంటోన్మెంట్ ప్రజల హృదయాల్లో సాయన్న, లాస్యనందిత చిరస్థాయిగా నిలిచిపోతా రని పేర్కొన్నారు. వారు చేయాలనుకున్న పనలను ఈ ప్రభుత్వం పూర్తి చేస్తుందని హామీ ఇచ్చారు. లాస్య మృతికి సంతాపం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు రేవంత్ పేర్కొన్నారు.



# వరదలతో నష్టపోయిన రైతులకు ఏ నష్టపరిహారం ఇప్పిస్తా: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల కురిసిన వర్షాలకు వరదలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తానని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం (జూలై 23, 2024) చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి మండల పరిధిలో దేవుల వాడ లో వర్షాలకు బురదమయమైన రోడ్లను పరిశీలించారు వివేక్ వెంకటస్వామి. ఎంద్లబండిపై వెళ్లి గ్రామంలోని వీధులను పరిశీలించారు. గ్రామంలో రోడ్లను నిర్మించేందుకు రూ. 12 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రోడ్లకు నిధులు కేటాయించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు కోటపల్లి మండలంలోని అన్నారం గ్రామ శివారుల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ప్రాణహిత ఉప్పొంగడంతో పంటలను పరిశీలించిన వివేక్ వెంకటస్వామి.. పంట నష్టంపై వ్యవసాయాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వరదలతో



నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. చెన్నూరు నియోజకవర్గంలోని అన్నారం, శీర్ష, జనగామ, సుపాక, వెంచపల్లె గ్రామాల్లో కాళేశ్వరం బ్యాక్ వాటర్ తో పంటలు నీట మునిగాయి.. మంత్రితో మాట్లాడాం.. కలెక్టర్ కి ఆదేశాలు జారీ చేశారు. పంట నష్టంపై వివరాలు అధికారులు సేకరిస్తున్నారు. వరదలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి.. ఇటీవల రైతులకు లక్ష లోపు రుణమాఫీ చేసింది. త్వరలోనే రైతులకు రైతు భరోసాను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.

# బడ్జెట్ లో వేతన జీవులకు స్వల్ప ఊరట

- కొత్త పన్ను విధానంలో పలు మార్పులు
- స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలకు పెంపు
- రూ.3 లక్షల వరకు పన్ను మినహాయింపు
- రూ.7 లక్షల వరకు 5 శాతం పన్ను

**హైదరాబాద్ పెన్ పవర్:** బడ్జెట్ లో వేతన జీవులకు స్వల్ప ఊరట కలిగించేలా కేంద్రం నిర్ణయం తీసుకుంది. కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ ను పెంచినట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ప్రస్తుతం రూ.50 వేలుగా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్ ను రూ.75 వేలకు పెంచామన్నారు. అలాగే, కొత్త పన్ను విధానంలో రూ.3 లక్షల ఆదాయం ఉన్న వారికి ఎలాంటి పన్ను లేదని మంత్రి చెప్పారు. రూ.3 లక్షలు ఆపై ఆదాయం ఆర్జించే వారికి శ్లాబుల ప్రకారం పన్ను విధిస్తామని వివరించారు. రూ.15 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారి నుంచి 30 శాతం పన్ను వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త విధానంలో వేతన జీవులు రూ.17,500 మేరకు పన్ను ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ఇక పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు.




## జొమాటో డెలివరీ బాయ్ ముసుగులో డ్రగ్స్ సప్లయ్.. వ్యక్తి అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** జొమాటో డెలివరీ బాయ్ ముసుగులో డ్రగ్స్ సప్లయ్ చేస్తున్న వ్యక్తి గుట్టు రట్టు చేశారు పోలీసులు. డెలివరీ బాయ్ ముసుగులో సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న షేక్ బిలాల్ ను మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నాలుగేళ్లుగా సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు షేక్ బిలాల్ డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్ సరఫరా చేసేందుకే జొమాటో డెలివరీ బాయ్ గా పనిచేస్తున్నాడు బిలాల్. షేక్ బిలాల్ నుంచి 45 మంది ఐటీ ఎంప్లాయిస్ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. వీళ్లంతా స్నాప్ చాట్, టెలిగ్రామ్ ద్వారా షేక్ బిలాల్ కు కాంటాక్ట్ అయి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారు. డ్రగ్స్ తీసుకుంటున్న 45 మంది ఐటీ ఎంప్లాయిస్ ను రిహాబిలిటేషన్ కు తరలిస్తామని మాదాపూర్ డీసీపీ వినీత్ అన్నారు. డ్రగ్స్ సరఫరాపై సమాచారం అందుకున్న యాంటీ నార్కోటిక్ పోలీసులు, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనకీల్లో షేక్ బిలాల్ ను అరెస్ట్ చేశారు. బిలాల్ నుంచి 12 లక్షల విలువైన 15 గ్రామా %వీణహీూ%, 22 కిలోల గంజాయి, 71 నైట్రోసిన్ ట్యాబ్లెట్లు, 491 గ్రాముల హాష్ ఆయిల్ ను సీజ్ చేశారు. రాజమండ్రికి చెందిన షేక్ బిలాల్ డ్రగ్స్ కి బానిస అయ్యాడని.. అరకు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్ నగరంలో అమ్ముతున్నట్లు డీసీపీ వినీత్ చెప్పారు. గతంలో %చీణూా% కేసులో అరెస్ట్ అయి షేక్ బిలాల్ జైలుకు కూడా వెళ్లినట్లు చెప్పారు. జైల్ నుంచి వచ్చిన తర్వాత మళ్ళీ డ్రగ్స్ సరఫరా మొదలు పెట్టాడని డీసీపీ చెప్పారు.

## నీతీ ఆయోగ్ బహిష్కరిస్తాం: తమిళనాడు సీఎం స్టాలిన్



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర బడ్జెట్ లో తమిళనాడు ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు సీఎం ఎంకే స్టాలిన్.. కేంద్రంలో మూడో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా బీజేపీ ప్రజలను చేసిందేమీ లేదని అన్నారు. తమిళనాడు చారిత్రక విధ్వంసాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ నిధులు కేటాయించలేదని అన్నారు. తమిళనాడుకు ఎలాంటి పథకాలు ప్రకటించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తామని తమిళనాడు సీఎం ఎంకేస్టాలిన్ అన్నారు. మంగళవారం (జూలై 23, 2024) పార్లమెంట్ లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తున్నాయి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర బడ్జెట్ పై మండిపడ్డారు. ఈ కుర్చీని కాపాడుకునే బడ్జెట్ అని అన్నారు. విభజన హామీల్లో ఆంధ్రప్రదేశ్ నిధులు కేటాయించిన వారికి.. తెలంగాణ గుర్తు కు రాలేదా అని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీని కలిసి అనేకసార్లు తెలంగాణ పరిస్థితిపై వివరించిన నిధులు కేటాయించలేదని అన్నారు.